## 171వ అధ్యాయం

## ١٧١ - بابُ تكبيرِ المُسافرِ إذا صَعِدَ الثَّنايَا وَشِبهَهَا وتَسْبِيحِهِ إذا هَبَطَ الأَوْدِيَةَ وَنَحوَهَا، وَالنَّهْيِ عَنِ المُبَالَغَةِ برَفْعِ الصَّوْتِ بالتَّكْبِيرِ وَنَحْوِهِ

## ప్రయాణంలో మెరక ప్రాంతాలకు వెళ్తున్నప్పుడు 'అల్లాహు అక్బర్' అని అనాలి, పల్లపు ప్రాంతాలలో దిగుతున్నప్పుడు 'సుబ్‌హానల్లాహ్' అని అనాలి, 'అల్లాహు అక్బర్ సుబ్‌హానల్లాహ్' అని మరీ బిగ్గరగా అనకూడదు

٩٧٥ - عن جابرٍ رَضيَ اللهُ عنه قال: كُنَّا إذَا صَعِدْنَا كَبَّرْنَا، وَإذَا نَزَلْنَا سَبَّحْنَا. رواه البخاري.

975. హజ్రత్ జాబిర్ (రజి) కథనం : మేము ప్రయాణంలో ఎత్తయిన ప్రదేశాలకు వెళ్తున్నప్పుడు 'అల్లాహు అక్బర్' అంటూ వెళ్ళేవాళ్ళం. దిగువ ప్రాంతాలకు వెళ్తున్నప్పుడు 'సుబ్‌హానల్లాహ్' అని చెబుతూ వెళ్ళేవాళ్ళం. *(బుఖారీ)*

*(సహీహ్ బుఖారీలోని జిహాద్ ప్రకరణం)*

٩٧٦ - وعن ابنِ عُمَرَ رَضيَ اللهُ عنهما قال: كانَ النَّبِيُّ ﷺ وَجُيُوشُهُ إذَا عَلَوُا الثَّنَايَا كَبَّرُوا، وَإذَا هَبَطُوا سَبَّحُوا. رواه أبو داود بإسناد صحيح.

976. హజ్రత్ ఇబ్నె ఉమర్ (రజి) కథనం: దైవప్రవక్త (సల్లం) మరియు ఆయన సైన్యం గుట్టలమీదకు ఎక్కినప్పుడు 'అల్లాహు అక్బర్' అంటూ ఎక్కేవాళ్ళు. అక్కణ్ణుంచి దిగినప్పుడు 'సుబ్‌హానల్లాహ్' అని పలుకుతూ దిగేవాళ్ళు. (అబూ దావూద్. దీని ఆధారాలు దృఢంగా ఉన్నాయి).

## ముఖ్యాంశాలు

ఎత్తయిన ప్రదేశాలకు వెళ్ళినప్పుడు మనిషిలో తాను చాలాపైకి ఎదిగిపోయాననే భావన కలగవచ్చు. అలాంటి భావన రాకుండా ఉండేందుకు ఎత్తయిన ప్రదేశాలకు వెళ్ళినప్పుడు "అల్లాహు అక్బర్" అంటూ దేవుని గొప్పదనాన్ని చాటుతూ వెళ్ళాలి. అల్లాహు అక్బర్ అంటే అల్లాహ్ అందరికంటే గొప్పవాడు, మిగతా సృష్టిరాశి అంతా ఆయన ఆధీనంలో ఉంది అని భావం.

అలాగే మెరకప్రాంతాల నుంచి కిందికి వచ్చినప్పుడు "సుబ్‌హానల్లాహ్" అంటూ దేవుని పవిత్రతను కొనియాడుతూ రావాలి. దిగటం అనేది క్షీణతను, పతనాన్ని సూచిస్తుంది. సుబ్‌హానల్లాహ్ అనగా అల్లాహ్ అటువంటి లోపాలన్నిటికీ అతీతుడని భావం.

٩٧٧ ـ وعنهُ قال: كانَ النَّبيُّ ﷺ إذا قَفَلَ مِنَ الحَجِّ أَوِ العُمْرَةِ كُلَّمَا أَوْفَى عَلى ثَنِيَّةٍ أَوْ فَدْفَدٍ كَبَّرَ ثَلاثاً، ثُمَّ قال: «لا إِلٰهَ إِلَّا اللهُ وَحْدَهُ لا شَرِيكَ لَهُ، لَهُ المُلْكُ وَلَهُ الحَمْدُ، وَهُوَ عَلى كُلِّ شَيْءٍ قَدِيرٌ. آيِبُونَ تَائِبُونَ عَابِدُونَ سَاجِدُونَ لِرَبِّنَا حَامِدُونَ. صَدَقَ اللهُ وَعْدَهُ، وَنَصَرَ عَبْدَهُ، وَهَزَمَ الأَحْزَابَ وَحْدَهُ» متفقٌ عليه.

977. హజ్రత్ ఇబ్నె ఉమర్ (రజి) గారే చేసిన కథనం : దైవప్రవక్త (సల్లం) హజ్ లేక ఉమ్రా నుండి తిరిగొచ్చినప్పుడు ఏదయినా గుట్టమీదికిగాని లేదా మరేదయినా ఎత్తయిన ప్రదేశానికి గాని ఎక్కవలసి వచ్చినప్పుడు మూడుసార్లు 'అల్లాహు అక్బర్' అని చెప్పి ఈ విధంగా ప్రార్థించేవారు:

"లా ఇలాహ ఇల్లల్లాహు వహ్‌దహూ లా షరీక లహూ లహుల్ ముల్కు వలహుల్ హమ్దు వహువ అలాకుల్లి షైయిన్ ఖదీర్. ఆయిబూన తాయిబూన ఆబిదూన సాజిదూన లిరబ్బినా హామిదూన. సదఖల్లాహు వాదహూ, వ నసర అబ్దహూ, వ హజమల్ అహ్‌జాబ వహ్‌దహూ."

وفي روايةٍ لمسلم: إذا قَفَلَ مِنَ الجيُوشِ أَوِ السَّرَايَا

(అల్లాహ్ తప్ప వేరొక ఆరాధ్యుడు లేడు. ఆయన ఒక్కడే. ఆయనకు భాగస్వాములెవరూ లేరు. విశ్వ సామ్రాజ్యాధికారం ఆయన చేతుల్లోనే ఉంది. సర్వస్తోత్రములు ఆయనకే శోభిస్తాయి. ఆయన

أَو الحَجِّ أَو العُمْرَةِ. قوْلُهُ: «أَوْفَى» أَي: ارْتَفَعَ، وقوله: «فَدْفَدٍ» هو بفتح الفاءَين بينهما دالٌ مهملةٌ ساكِنَةٌ، وَآخِرُهُ دال أخرى، وهو: الغَلِيظُ المُرْتَفِعُ مِنَ الأَرْض.

ప్రతి వస్తువుపైనా అధికారం కలిగి వున్నాడు. మేము ప్రయాణం నుండి తిరిగొస్తున్నవాళ్ళం. పాపాలపై పశ్చాత్తాప పడేవాళ్ళం. ఆరాధనలు చేసేవాళ్ళం. దైవానికి సాష్టాంగప్రణామాలు చేసే వాళ్ళం. మా ప్రభువుని స్తుతించేవాళ్ళం. దేవుడు తన వాగ్దానాన్ని నెరవేర్చాడు. తన దాసునికి సహాయం చేశాడు. తనొక్కడే సైన్యాలన్నిటినీ ఓడించాడు).

*(బుఖారీ - ముస్లిం)*

ముస్లింలోని వేరొక ఉల్లేఖనంలో "పెద్ద సైన్యాలతో, చిన్న సైన్యాలతో యుద్ధం చేసి తిరిగొచ్చినప్పుడు లేక హజ్, ఉమ్రాల నుంచి తిరిగొచ్చినప్పుడు ఆయన (ఈ దుఆ చేసేవారు)" అని ఉంది.

*(సహీహ్ బుఖారీలోని జిహాద్ ప్రకరణం, సహీహ్ ముస్లింలోని హజ్ ప్రకరణం)*

٩٧٨ ـ وعن أَبي هُرَيرَةَ رَضيَ اللهُ عنهُ أَنَّ رَجُلاً قال: يَا رسولَ اللهِ إِني أُرِيدُ أَن أُسافِرَ فَأَوْصِنِي، قالَ: «عَلَيْكَ بِتَقْوَى اللهِ، وَالتَّكْبِيرِ عَلى كُلِّ شَرَفٍ» فَلَمَّا وَلَّى الرَّجُلُ قال: «اللَّهُمَّ! اطْوِ لَهُ البُعْدَ، وَهَوِّنْ عَلَيهِ السَّفَرَ» رواه الترمذي وقال: حديث حسن.

978. హజ్రత్ అబూ హురైరా (రజి) కథనం : ఒక వ్యక్తి దైవప్రవక్త (సల్లం) దగ్గరకు వచ్చి, "దైవప్రవక్తా! నేను ప్రయాణానికి బయలుదేరాలను కుంటున్నాను. నాకు ఏమయినా ఉపదేశించండి" అని విన్నవించుకున్నాడు. "అనునిత్యం అల్లాహ్‌కు భయపడుతూ ఉండు. ఎత్తైన ప్రదేశాలకు వెళ్తున్నప్పుడల్లా 'అల్లాహు అక్బర్' అని అంటూ ఉండు" అని దైవప్రవక్త (సల్లం) ఆ వ్యక్తికి ఉపదేశించారు. అతను వెను

తిరిగి వెళ్ళిపోగానే, "దేవా! ఈ వ్యక్తి వెళ్ళవలసిన దూరాన్ని కుదించు. ఇతని ప్రయాణాన్ని సులభతరం చెయ్యి" అని ప్రార్థించారు. *(తిర్మిజీ - హసన్)*

## ముఖ్యాంశాలు

ప్రయాణీకులు ప్రయాణానికి బయలుదేరేముందు తమకు తెలిసిన ధర్మకోవిదుల, ధర్మపరాయణులైన పెద్ద మనుషుల ఆశీర్వాదాలు పొంది బయలుదేరాలి. అలాంటి పెద్ద మనుషులు కూడా తమను సంప్రదించే వారిని చిత్తశుద్ధితో ఆశీర్వదించి పంపాలి. అంతేకాదు, ప్రయాణంలో అల్లాహ్ పట్ల, ఆయన ఆదేశాల పట్ల అజాగ్రత్తకు లోనుగాకుండా ఉండమని వారికి హితవు చెప్పి మరీ పంపించాలి.

979. హజ్రత్ అబూ మూసా అష్అరీ (రజి) కథనం : మేము ఒక ప్రయాణంలో దైవప్రవక్త (సల్లం) వెంట ఉన్నాం. అప్పుడు మేము ఏదయినా గుట్టమీదికి ఎక్కినప్పుడల్లా, "లా ఇలాహ ఇల్లల్లాహ్, అల్లాహు అక్బర్" అని బిగ్గరగా అంటుండేవాళ్ళం. దైవప్రవక్త (సల్లం) అది విని, "ప్రజలారా! మీ పట్ల మీరు మృదువుగా వ్యవహరించండి (మరీ అంత బిగ్గరగా కేకలు పెట్టకండి). ఎందుకంటే మీరు చెవిటివాడినో లేక దూరంగా ఉన్నవాడినో పిలవడంలేదు. మీరు పిలిచేవాడు మీతోపాటే ఉన్నాడు. ఆయన అందరి పిలుపులూ వింటాడు, పిలిచేవాడికి అతి చేరువలో ఉంటాడు" అని బోధపరచారు. *(బుఖారీ - ముస్లిం)*

٩٧٩ - وعن أَبي موسى الأشعَرِيِّ رَضيَ اللهُ عنهُ قال: كنَّا مَعَ النبيِّ ﷺ في سَفَرٍ، فكُنَّا إذَا أَشْرَفْنَا عَلى وَادٍ هَلَّلْنَا وَكَبَّرْنَا وَارْتَفَعَتْ أَصْوَاتُنَا، فقالَ النبيُّ ﷺ: «يَا أَيُّهَا النَّاسُ! ارْبَعُوا عَلى أَنْفُسِكُمْ فَإِنَّكُمْ لا تَدْعُونَ أَصَمَّ وَلا غَائِباً، إِنَّهُ مَعَكُمْ، إِنَّهُ سَمِيعٌ قَرِيبٌ» متفقٌ عليه.

«ارْبَعُوا» بفتحِ الباءِ الموحدةِ، أَي: ارْفقوا بأَنْفُسِكم.

*(సహీహ్ బుఖారీలోని జిహాద్ ప్రకరణం, సహీహ్ ముస్లింలోని దైవధ్యానం, ప్రార్థనల ప్రకరణం)*

## ముఖ్యాంశాలు

దేవుని ఘనతను, ఆయన పవిత్రతను కొనియాడినప్పుడు మరీ బిగ్గరగా అరవకూడదని దైవప్రవక్త (సల్లం) తన అనుచరులకు ఉపదేశించారు. గొంతు చించుకుంటూ కేకలు పెట్టి ప్రార్థిస్తే దేవుడు ప్రసన్నుడవుతాడని ఎక్కడా లేదు. పైగా దేవుణ్ణి విలపిస్తూనూ, గోప్యంగానూ ప్రార్థించాలని దివ్య ఖుర్‌ఆన్‌లో ఆదేశించబడింది. దేవుడు దాసులకు అతి చేరువలో ఉంటాడు. పిలిచేవాని పిలుపును ఆయన వెంటనే వింటాడు. సప్తాకాశాలపై దైవపీఠం మీద ఆసీనుడయి వున్నప్పటికీ ఆయన జ్ఞానం విశ్వమంతటా వ్యాపించి ఉంది.

నేడు కొందరు ఫర్జ్ నమాజ్ పూర్తవగానే 'లా ఇలాహ ఇల్లల్లాహ్' అని గాని లేక 'సలాత్ వ సలాం' అని గాని బిగ్గరగా ప్రార్థించటం మొదలుపెడతారు. దానివల్ల ప్రక్కన నమాజ్ చేసేవారికి ఇబ్బంది కలుగుతున్నా పట్టించుకోరు. అలాగే మరికొందరు గుంపులుగా కూర్చొని, "అల్లాహు హువ" అంటూ బిగ్గరగా మొత్తుకుంటూ ఉంటారు. నిజానికి అలా చేయాలని ధర్మంలో ఎక్కడా లేదు. అలాంటివారికి ఈ హదీసు కనువిప్పు కావాలి.